క్రైం కథ

# వాళ్ళిద్దరూ...



"మీవారు మిమ్మల్ని చంపబోతున్నారు."

ఆమె భయంగా అతనివైపు చూసింది.

"అదీ యీరోజే. మీరు వెంటనే ఇల్లు వదిలి ఎక్కడికైనా పారిపోండి. మీ ప్రాణాలు రక్షించుకోండి."

"ఆ విషయం మీకెలా తెలుసు?"

"చెబుతాను".

***

వేణుగోపాల్ ఎం.ఎ. సైకాలజీ చేశాడు. 'మనుషుల్లో నేర ప్రవృత్తి' అనే సబ్జెక్టు మీద థీసిస్ రాస్తున్నాడు. థీసిస్ టైపు చేసుకోవడానికి ఓ పాత కంప్యూటర్ సిస్టమ్ ఉంటే చూడమని అతని స్నేహితుడు, 'రమేష్ ఎలక్ట్రానిక్స్' ప్రొప్రయిటర్ అయిన రమేష్‌కు చెప్పాడు.

వారం రోజుల్లోనే రమేష్ ఓ పాత కంప్యూటర్ సిస్టమ్‌ను వేణు ఇంటికి పంపాడు. ఆరోజు రాత్రి కంప్యూటర్‌కు కనెక్షన్స్ యిచ్చి పరీక్షించాడు వేణు. సిస్టమ్ బాగానే పనిచేస్తోంది. బ్లాక్ అండ్ వైట్ మానిటర్ అయినా, సిస్టమ్ కాస్త స్లోగా వున్నా, టైపింగ్‌కు మాత్రమే అవసరం కనుక ఆ సిస్టమ్‌ను కొనడానికే నిర్ణయించుకున్నాడతను. హార్డ్ డిస్క్‌లో కొన్ని గేమ్స్, ఫైల్స్ ఉన్నాయి. సిస్టమ్ అమ్మిన వ్యక్తి తయారుచేసుకున్న ఫైల్స్ కాబోలు అనుకుంటూ ఓ ఫైలు ఓపెన్ చేశాడు. 'మై వైఫ్ ఎండెడ్ మై లైఫ్' అన్న టైటిల్‌తో ఉందా ఫైలు. కుతూహలంగా ఆ ఫైలు చదవసాగాడు. దాదాపు ఓ బయోడేటాలా ఉంది ఆ ఫైలు. అతని జీవితంలో జరిగిన ముఖ్యమైన సంఘటనలు, వాటి తేదీలు రాసుకుని ఉన్నాడు. అతను కాలేజీలో చేరిన తేదీ, చదువు పూర్తయిన తేదీ, ఉద్యోగంలో చేరిన తేదీ, పెళ్ళయిన తేదీ, హనీమూన్‌కు వెళ్ళిన తేదీ – ఇలా పలు సంఘటనలు, తేదీలు ఆ ఫైల్లో చోటుచేసుకున్నాయి. తన తల్లిదండ్రుల్ని కోల్పోయిన రోజుల్ని తన జీవితంలో బ్లాక్‌డేలుగా రాసుకున్నాడు. పిల్లలు లేకపోవడం వల్ల తను జీవితంలో చాలా కోల్పోయానని రాసుకున్నాడు. అయితే ఎక్కడా తన పేరుగాని, భార్య పేరుగాని రాయలేదు.

ఉన్నట్టుండి బయోడేటా కూడా కథలోలా ఓ ఆసక్తికరమైన మలుపు తిరిగింది.

'అతను మాకు పరిచయమైన రోజు, మా ఇంటికి అతను భోజనానికి వచ్చిన రోజు, నా భార్య అతనితో సినిమాకు వెళ్ళిన రోజు, అతనింటికి ఆమె ఒంటరిగా వెళ్ళిన రోజు.

వేణు ఆసక్తిగా చదువుతున్నాడు.

'జీవితంలో నేను మొదటిసారి తాగిన రోజు. నా భార్యను కొట్టిన రోజు. కొట్టి ఏడ్చిన రోజు'.

వేణుకు అతనిపై ఎంతో జాలి కలిగింది. అతను ఎంత సెన్సిటివ్ కాకపోతే ప్రతి విషయాన్నీ తేదీతో సహా గుర్తుపెట్టుకున్నాడు – అంతటి వ్యథకు గురిచేసిన అతని భార్యపై వేణుకు కోపం వచ్చింది.

కొన్ని కొటేషన్స్ కూడా ఆ ఫైలులో చోటుచేసుకున్నాయి.

'జీవితంలో అనుకున్నవన్నీ పొందలేము. కాని పొందినవి చేజారిపోతే తట్టుకోవడం కష్టం'

'ఈ ప్రపంచంలో మంచివాడు సుఖంగా ఉండలేడు. అతని చుట్టూ ఉన్నవాళ్ళు మాత్రం సుఖపడుతూ ఉంటారు'

చివరి లైనులో 'నా భార్య చనిపోయిన రోజు' అని రాసి తారీఖు వేసి ఉంది. – 'హమ్మయ్య, అతని బాధలు తీరిపోయాయన్నమాట. ఆమె బతికుండి అతన్ని చిత్రవధ చేయడం కంటే చనిపోయి అతన్ని ప్రశాంతంగా ఉంచడం మంచిదే' అనుకున్నాడు. కంప్యూటర్ షట్‌డవున్ చేసి మంచంమీద పడుకున్నాడు. అయితే అతనికి వెంటనే నిద్రపట్టలేదు. చాలాసేపు ఆ డైరీ రాసుకున్న వ్యక్తి గురించే ఆలోచించసాగాడు. 'భార్య ప్రేమను కోల్పోయిన వ్యక్తి ఎంతో దురదృష్టవంతుడు' అనుకున్నాడు.

అంతలో ఆ ఫైలులోని ఓ విషయం గుర్తొచ్చి ఉలిక్కిపడ్డాడు. 'తను చూసింది నిజమా లేక పొరబడ్డాడా?' అనుకుంటూ కంప్యూటర్ ఆన్ చేసి ఆ ఫైలు మళ్ళీ ఓపెన్ చేశాడు.

'నా భార్య చనిపోయిన రోజు: 1.6.2006' అని ఉంది అందులో.

తన అనుమానం నిజమే. అంటే... ఆమె రేపు చనిపోతుందా? ఎలా చనిపోతుంది? అతను చంపేస్తాడా? లేకుంటే ఆమె చనిపోయే రోజు అతనికి ముందుగానే ఎలా తెలుస్తుంది? ప్రయత్నిస్తే తను ఆమెను కలిసి హెచ్చరించవచ్చు. ఆమె ప్రాణం కాపాడవచ్చు. ఆమె చేస్తున్నది తప్పే కావచ్చు. కాని అంత పెద్ద శిక్ష వెయ్యడం అన్యాయం. పైగా అటువంటి సున్నిత మనస్తత్వం గల వ్యక్తి నేరస్తుడిగా మారకూడదు – అనుకున్నాడు.

అపరాధ పరిశోధన పట్ల అతనికున్న ఆసక్తి, సాటి మనిషి పట్ల సానుభూతి అతన్ని ఊరుకోనివ్వలేదు. వెంటనే రమేష్‌కు ఫోన్ చేసి ఆ సిస్టమ్ ఎక్కడ్నుంచి వచ్చింది అడిగాడు. అతను చెన్నైలో కొన్నాడన్న విషయం తెలుసుకుని, ఏ షాపునుంచి కొన్నది తెలుసుకుని ఆ షాపు అడ్రస్ రాసుకున్నాడు.

''ఏమైంది వేణు? ఏమిటి ప్రాబ్లం'' రమేష్ అడిగాడు.

''అఫ్‌కోర్స్ దేరీజ్ ఎ ప్రాబ్లమ్. నేను తర్వాత చెబుతాను.''

''మై వైఫ్ ఎండెడ్ మై లైఫ్ ఫైలు చదివావా?''

''అవును. అందుకే చెన్నై వెళుతున్నాను నేను.''

''నాకేం విశేషం కనబడలేదు అందులో. సేమ్ ఓల్డ్ స్టోరీ.''

''అదే మామూలు వ్యక్తికి, సైకాలజీ చదివిన వ్యక్తికీ ఉన్న తేడా. నేను చెన్నై వెళ్ళి వచ్చాక వివరంగా చెబుతాను. బై''


వేణు మరుసటిరోజు ఉదయం చెన్నైకి వెళ్ళి ఆ షాపులో సిస్టమ్ అమ్మినతని గురించి విచారించాలని అనుకున్నాడు. తను నాలుగు గంటలకు బయలుదేరితే ఎనిమిది గంటలకు చెన్నై చేరుతాడు. తొమ్మిది గంటలకు షాపు తెరిచినా పది గంటల లోపు తను ఆ వ్యక్తి ఇల్లు కనుక్కుని అని భార్యను కలిసి హెచ్చరించవచ్చు. ఓ హత్యను నివారించవచ్చు. ఓ ప్రాణం కాపాడవచ్చు' అనుకున్నాడు.


అనుకున్నట్లే మరుసటిరోజు ఉదయం తొమ్మిది గంటలకు ఆ షాపులో ఉన్నాడు వేణు. అదృష్టవశాత్తు ఆ షాపు యజమానికి తను సిస్టమ్ ఎవరి నుంచి ఎంతకు కొన్నదీ, ఎవరికి ఎంతకు అమ్మిందీ రాసుకునే అలవాటు ఉంది. అయితే ఆ రేట్ల వివరాలు వేణు చూడకుండా జాగ్రత్తపడుతూ అడ్రసు చెబితే వేణు ఓ పేపరు మీద రాసుకున్నాడు.

''ఈ అడ్రసు ఎందుకోసమో మాత్రం మీరు చెప్పడంలేదు'' అన్నాడు షాపతను నిష్ఠూరంగా. వేణు చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

''మీ సెల్ నెంబరు యివ్వండి, ఎందుకైనా మంచిది. నా కస్టమర్‌కు ఏదైనా ఇబ్బంది కలిగితే మీరే బాధ్యులు'' అన్నాడు షాపతను.

వేణు తన సెల్ నెంబరు ఇచ్చి ''ఏ యిబ్బందీ రాదు'' అంటూ బయటికి నడి





చాడు.

గతవారంలో రమేష్ కొన్నవి రెండు సిస్టమ్‌లే కావడం వల్ల, అందులో పాత సిస్టమ్ ఒకటే కావడం వల్ల వివరాలు తొందరగానే దొరికాయి అతనికి. ఆటో ఎక్కి 'టి–నగర్' అన్నాడు. టి.నగర్‌లో ఎక్కువమంది తెలుగువాళ్ళు నివసిస్తారని విన్నాడు. తను కలవబోయే వ్యక్తి తెలుగు తెలిసిన వ్యక్తి అయితే బాగుంటుంది అనుకున్నాడు.

పావుగంటలో ఆ ఇల్లు చేరుకున్నాడు. రంగులు వెలసిపోయి, చూడటానికి ఏమాత్రం ఆకర్షణీయంగా లేదు ఇల్లు. గేటు తీసుకుని లోపలికి అడుగుపెట్టాడు.

దట్టంగా పెరిగిన చెట్లు, శుభ్రంచేసి ఎన్నో రోజులయినట్లు నేల మీద కుప్పలు కుప్పలుగా ఆకులు, ప్లాస్టిక్ కవర్లు.

'రాత్రిపూట ఈ ఇంట్లో అడుగుపెట్టి ఉంటే జడుసుకుని ఉండేవాణ్ణి' అనుకుంటూ కాలింగ్‌బెల్ నొక్కాడు.

తలుపు తెరుచుకోగానే ఓ స్త్రీ కనిపించింది. చాలా అందంగా ఉంది ఆమె. అయితే ఆమె ముఖంలో కాస్త క్రౌర్యం, కాసింత విసుగు కనిపించింది అతనికి.

''ఎవరు కావాలి?'' తలుపు పూర్తిగా తెరవకుండా అడిగింది.

''మీరే కావాలి''

ఆమె అతనివైపు కోపంగా చూసి తలుపు మూయబోయింది.

''మీరు ప్రమాదంలో ఉన్నారు. మిమ్మల్ని హెచ్చరించడానికి వచ్చాను''

ఆమె ఆశ్చర్యంగా చూసింది అతనివైపు.

''మీవారు మిమ్మల్ని చంపబోతున్నారు.''

ఆమె భయంగా అతనివైపు చూసింది.

''అదీ ఈరోజే. మీరు వెంటనే ఇల్లు వదిలి ఎక్కడికైనా పారిపోండి. మీ ప్రాణాలు కాపాడుకోండి.''

''ఆ విషయం మీకెలా తెలుసు?''

''చెబుతాను''

''కూర్చొని చెప్పండి'' సోఫా చూపిస్తూ చెప్పింది.

వేణు సోఫాలో కూర్చున్నాక తను కంప్యూటర్ కొనాలని అనుకున్నప్పట్నుంచీ జరిగినదంతా ఆమెకు చెప్పాడు. అంతా విన్న తర్వాత ఆమె ఓ నిమిషం మౌనంగా ఉండిపోయింది. తర్వాత నవ్వ సాగింది. తెరలు తెరలుగా నవ్వుతూనే ఉంది.

ఆమె నవ్వుతుంటే మరింత అందంగా కనిపించింది అతనికి. ఆమెనే చూస్తూండిపోయాడు. తర్వాత ఆమె నవ్వటం ఆపి ''మీరు పొరబడ్డారు. ఆయన అలాంటివారు కారు. నేనంటే ప్రాణం ఆయనకు. పైగా నాకు బాయ్‌ఫ్రెండ్స్ ఎవరూ లేరు'' అంది.

''మరి హార్డ్ డిస్క్‌లో అలా...''

''ఆయన కథలు రాస్తుంటారు. కథకోసం సినాప్సిస్ రాసుకుని ఉంటారు''

''కాని అది కథలా లేదు. బయోడేటాలా ఉంది.''

''కథలో బయోడేటా ఉండకూడదా? పైగా ఆయన తమాషాకి కూడా రాసుండొచ్చు. ఆయన భలే తమాషా మనిషి. ఎప్పుడూ మనుషుల్ని మిస్‌లీడ్ చేస్తూ ఉంటారు. లేని అనుమానాలు కలిగిస్తూ ఉంటారు. చూశారుగా మీరు ఎలా మిస్‌లీడ్ అయ్యారో. ఇంతదూరం ఎండలో ప్రయాణించి, ఎంత సమయం, ఎండ డబ్బు వృధా చేసుకున్నారో?''

వేణు తల పంకించి ''నిజమే. ఇకపై తమాషాలు చేసి యితరుల్ని యిబ్బంది పెట్టవద్దని మీ ఆయనకు చెప్పండి. అయితే ఒక విషయంలో నాకు ఆనందంగా ఉంది. మీవారు అటువంటి వారు కారన్న విషయం. అయినా మీ జాగ్రత్తలో మీరుండండి. కనీసం యీరోజు గడిచేదాకానైనా'' అన్నాడు.

ఆమె ''అలాగే'' అంది నవ్వుతూ.

అంతలో ఓ వ్యక్తి ''హాయ్ పమ్మీ'' అంటూ ఇంట్లోకి ప్రవేశించాడు. ముప్ఫై ముప్ఫైఅయిదు మధ్య ఉంటుంది అతని వయస్సు. అతనూ అందంగా ఉన్నాడు.

ఆమె కళ్ళతోనే వేణువైపు చూపిస్తూ సైగ చేసింది.

అతను వేణువైపు తిరిగి ''మీరు...'' అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఈయన పేరు వేణుగోపాల్. సైకాలజీ స్టూడెంటు. మీరు నన్ను చంపబోతున్నారని తెలిసి నన్ను హెచ్చరించడానికి తిరుపతి నుంచి వచ్చారు'' అంది ఆమె అతనితో.

''నేను నిన్ను చంపడమా? తమాషాగా ఉందే'' ఆశ్చర్యంగా అన్నాడతను.

''మీరు చేసే తమాషాలే యివి. మీరు హార్డ్‌డిస్క్‌లో కథ రాయడానికి ఉంచుకున్న విషయాలు చదివి ఆయన మిస్‌లీడ్ అయ్యారు.''

''ఏ హార్డ్ డిస్క్‌లో?''

''ఆ విషయం మీకే తెలియాలి. నేనెప్పుడు తాకాను మీ కంప్యూటర్ని? అయినా కంప్యూటర్ అమ్మేటప్పుడు హార్డ్ డిస్క్‌లోని ఫైల్స్‌ని డిలిట్ చెయ్యాలని తెలియదా మీకు?'' కోపంగా అంది ఆమె.

''ఓ సారీ. నాకు ఇప్పుడు అర్థమైంది. ఆ సిస్టమ్ మీరు కొన్నారా? అది చాలా పాతది సార్. దాన్నెందుకు కొన్నారు మీరు?''

''కావాలనే కొన్నాను, టైపింగ్ కోసం''

''సో ఆ హార్డ్ డిస్క్‌లో నేను ఉంచిన విషయం మిమ్మల్ని మిస్‌లీడ్ చేసిందన్నమాట. ఐ యామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ. కాని ఓ ప్రాణం కాపాడటం కోసం మీరు యింత శ్రమ తీసుకోవడం నిజంగా గొప్ప విషయం. రోడ్డు మీద ఓ వ్యక్తి కిందపడితే లేపడానికి ఎవరూ ముందుకు రావడం లేదు ఈరోజుల్లో. అటువంటిది ఎక్కడో తిరుపతిలో ఉన్న మీరు ... యింతదూరం .. ఓహ్ యు ఆర్ రియల్లీ గ్రేట్'' అన్నాడు వేణు వైపు మెచ్చుకోలుగా చూస్తూ.

''నేను కాఫీ తెస్తాను'' అంటూ ఆమె లోపలికెళ్ళింది.

''ఇంతకూ మీరు రాసింది సినాప్సిసేనా?'' అనుమానంగా అడిగాడు వేణు.

''కాదు. అది కథలో ఓ భాగం. ఆ వివరాలు చదివిన ఓ యువకుడు ఆ హత్యను ఆపడానికి ప్రయత్నిస్తాడు. తర్వాత నేను ఆ కథను పూర్తిచేయలేదు కాని ఆ కథలో నేను ఎలా అనుకున్నానో మీరు అలాగే ప్రవర్తించారు. అందుకే అంటారు కవులు, రచయితలు భవిష్యత్తును దర్శించగలరని. ఇలా జరగాలనే నేను ఉద్దేశ్యపూర్వకంగా ఆ ఫైలును డిలిట్ చెయ్యలేదు.''

'ఏడవలేకపోయావు' అంటూ మనసులోనే అతన్ని తిట్టుకున్నాడు వేణు.

ఆమె కాఫీ తెస్తుంటే అతను వంటగది వరకూ వెళ్ళి కప్పులు అందుకున్నాడు. కాఫీ తాగాక వేణు వారి వదనుంచి సెలవు తీసుకుని బయలుదేరాడు.

***

''నీకు నిజంగా బుద్ధిలేదు. ఇంట్లోకి ఎవరినిబ

డితే వారిని రానివ్వడమేనా?''

''ఇది బాగుంది. అతను 'మీ భర్త మిమ్మల్ని చంపబోతున్నాడు' అని చెబితే మన విషయం అతనికి తెలిసిపోయిందేమో, నీవు వచ్చేంతవరకు అతన్ని యిక్కడే ఉంచితే నువ్వు వచ్చి అతన్ని మేనేజ్ చేస్తావనుకుని సోఫాలో కూర్చోబెట్టాను. నేను భయపడ్డంతా అయింది. ఆయన మన విషయాలన్నీ కంప్యూటర్‌లో ఫీడ్ చేసి పెట్టుకున్నాడు. ఆయన్ను చంపడం మంచిది కాదని నీకెంత చెప్పినా నీవు వినలేదు.''

''వాణ్ణి చంపడం మన మంచికే అయ్యిందని అర్థం కాలేదా నీకు? వాడు నిన్ను చంపడానికి తేదీ కూడా ఫిక్స్ చేశాడు. నేనాపని చెయ్యకుంటే యీనాడు నువ్వు పోయేదానివి. అయినా వాడు కంప్యూటర్‌లో అవన్నీ ఫీడ్ చేస్తుంటే నువ్వేం చేస్తున్నావు?'' కోపంగా అడిగాడు.

''ఆయన ఆ కంప్యూటర్‌తో ఏమేం చేస్తున్నాడో నన్ను నిద్ర మానుకుని చూడమంటావా? కంప్యూటర్ అమ్మే ముందు అందులోని ఫైల్స్ డిలిట్ చెయ్యాలని తెలియదు మొద్దుమనిషికి.''

''ఇంతకూ ఎందుకు అమ్మాడు ఆ కంప్యూటర్ని?'' విసుగ్గా అడిగాడు అతను.

''ఆ ఎదురింటాయన అమ్ముతూంటే ఆటో ఖర్చు అవుతుందని అతనితోపాటు వెళ్ళి అమ్మేసి వచ్చాడు. కొత్త సిస్టమ్ కొనాలని ఆయన కోరిక. ఆ కోరిక తీరకుండానే నువ్వు పైకి పంపేశావు. అయితే రచయితగా భలే నటించావు సునీల్. అంత బాగా మాట్లాడ్డం నువ్వెప్పుడు నేర్చుకున్నావ్?'' అంది నవ్వుతూ.

''అవసరం నేర్పుతుంది''

''నాకెందుకో భయంగా ఉంది సునీల్. ఆ వచ్చినతను నిజంగా సైకాలజీ స్టూడెంటో లేక ఏ పోలీసాఫీసరో ఎవరికి తెలుసు?''

''ఎందుకు అనవసరంగా భయపడతావు? నాకు తెలుసు, అతను పోలీసాఫీసరు కాదు. అతను స్టూడెంట్ అయి ఉంటాడు. మనం అతన్ని చక్కగా కన్విన్స్ చేసి పంపాం. అతను నేరుగా బస్సెక్కి తిరుపతి వెళతాడు. పనిబడి మళ్ళీ చెన్నై వచ్చినా ఇంత పెద్ద నగరంలో మనకు మళ్ళీ తారసపడడు.''

ఇంతలో కాలింగ్‌బెల్ మోగడంతో తలుపు తెరిచిన ఆమె షాక్ తిన్నదానిలా నిలబడిపోయింది. ఎదురుగా వేణుగోపాల్ నిలబడి ఉన్నాడు.

''సారీ. నా సెల్ యిక్కడే ఎక్కడో మరిచిపోయాను. కిందికెళ్ళి ఫోన్ చేద్దామంటే కనిపించలేదు'' అంటూ టీపాయ్ మీదున్న పేపర్ల నడుమ ఉన్న సెల్‌ని తీసి కొన్ని బటన్లు నొక్కాడు. అంతక్రితం వాళ్ళిద్దరూ మాట్లాడుకున్న మాటలు అందులోంచి స్పష్టంగా వినిపించసాగాయి.

వాళ్ళిద్దరూ ఆందోళన నిండిన ముఖాలతో అతనివైపే చూడసాగారు. వేణు ఆమెవైపు చూస్తూ ''నేను సోఫాలో కూర్చున్నప్పుడు పక్క గదిలో టేబుల్ మీది ఫోటోఫ్రేమ్‌లో ఓ జంట కనిపించారు. అయితే వారి ముఖాలు మాత్రం యింతదూరం నుంచి కనిపించలేదు. మీరు కాఫీ చేసుకురావడానికి లోపలికి వెళుతూ మిమ్మల్ని చాటుగా చేసుకుని ఆ ఫోటోఫ్రేమ్‌ని తీసుకెళ్ళినట్లున్నారు. అందుకే తర్వాత ఆ ఫోటోఫ్రేమ్ అక్కడ నాకు కనబడలేదు. అప్పుడర్థమైంది నాకు ఆ ఫోటోఫ్రేమ్‌లోని వ్యక్తుల్లో ఒకరు మీరని, మీ పక్కనున్న వ్యక్తి యీయన కాదని. ఆ విషయం నేను గమనించకూడదనే మీరు ఆ ఫోటోను లోపలికి పట్టుకెళ్ళారని. మీ భర్త మిమ్మల్ని చంపబోయే విషయం ముందుగానే పసిగట్టి మీరు ఆయన్ని తుదముట్టించి ఉంటారన్న అనుమానం కలిగింది. అందుకే నా సెల్‌ను రికార్డింగ్ మోడ్‌లో పెట్టి వెళ్ళాను. నా అనుమానం నిజమైంది. నౌ యు ఆర్ కాట్. మనం మళ్ళీ పోలీస్ స్టేషన్‌లో కలుసుకుందాం'' అంటూ వేగంగా బయటకు వచ్చి ఆ ఇంటి తలుపును బయటినుంచి గడియపెట్టాడు, వాళ్ళు తనపై దాడి చెయ్యకుండా.

కాంపౌండ్ వాల్ గేటు తీసుకుని రోడ్డు మీదికి రాగానే అతని సెల్ మ్రోగింది. వేణు సెల్ ఆన్ చేసి 'హలో' అన్నాడు.

''సార్. నేను కాశెట్టి స్ట్రీట్ నుంచి కంప్యూటర్ వెండర్ని. మీకు సిస్టమ్ అమ్మిన వ్యక్తి ఆ సిస్టమ్ తిరిగి తనకు కావాలంటున్నాడు. ఎంత ధర అయినా చెల్లిస్తానంటున్నాడు''

''కాని... ఆయన యిప్పుడు లేడుగా''

''ఎందుకు లేడు. ఇప్పుడే నాతో మాట్లాడి తేను. మీరు ఆయన్ని యింకా కలవలేదటగా?''

''నేను ఆయన ఇంట్లోనే ఉన్నాను. ఆయన ఈమధ్యే చనిపోయాడని ఆయన భార్య చెప్పింది''

''అదెలా సాధ్యం? ఆయన మీరటువెళ్ళగానే నాకు ఫోన్ చేశాడు. ఆయన గొంతు కూడా నాకు బాగా గుర్తు. మీరు ఉన్న ఇంటి అడ్రస్ చెప్పండి.''

వేణు చెప్పాడు.

''అదీ సంగతి. ఇంటి నెంబరు నూట పదహారు కాదు. నూట డెబ్బై ఆరు. నా కళ్ళజోడు సమయానికి కనిపించక అలాగే చదివి మీకు చెప్పాను''.

''మంచిపని చేశారు'' అని మనసులోనే విసుక్కుంటూ ఎదురుగా కనిపిస్తున్న ఇంటివైపు చూసి ఆశ్చర్యపోయాడు.

ఆ ఇంటి నెంబరు నూట డెబ్బై ఆరు.

''నేను మళ్ళీ మాట్లాడతాను మీతో'' అని సెల్ ఆఫ్‌చేసి గేటు తీసుకుని ఆ ఇంట్లోకి అడుగుపెట్టాడు. అక్కడ కనిపించిన దృశ్యం చూసి స్థాణువులా నిలబడిపోయాడు.

హాల్లో మంచంపై ఓ స్త్రీ శవం ఉంది. ఓ మధ్య వయసు వ్యక్తి కింద కూర్చుని గట్టిగా రోదిస్తున్నాడు.

**– సి.ఎస్. చంద్రశేఖర్**



## మందులు కొనేముందు బహుపరాక్!

మందుల చీటీలు లేకుండా ఎలాంటి మందులు కొనుగోలు చేయవద్దని ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహా ఇస్తోంది. ఫార్మాసిస్టులు డాక్టర్లు రాసిచ్చే మందుల చీటీలు లేకుండానే మందుల్ని విక్రయిస్తున్నారని డబ్ల్యూహెచ్‌వో తన వార్షిక నివేదికలో తెలియజేసింది. ఈ విధమైన విక్రయాలు ఆరోగ్యపరమైన ఇబ్బందుల్ని తెచ్చిపెడతాయని సాధ్యమైనంత మేరకూ ఇలాంటి కొనుగోళ్ళ విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలంటున్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈరకమైన ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తంచేస్తోంది. అమెరికాలో గత ఏడాది ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డియే)సంస్థ నిర్వహించిన సర్వేలో **500** మంది ప్రసిద్ధ ఫార్మాసిస్టుల్ని కలిసినప్పుడు అనేక ఆసక్తికరమైన విషయాలు వెల్లడయినాయి. అంతేకాకుండా ఇక నుంచి అమెరికా వంటి దేశాల్లో మందుల షాపుల్లో ఇలాంటి ప్రిస్కిప్షన్ లేకుండా ఎలాంటి మందులూ విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎఫ్‌డియే నిర్ణయించింది. అమెరికాలో వందలాది మందుల కంపెనీలు తయారుచేసే వివిధ ఔషధాలు ఈ సంస్థ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నవీ, లేనివీ తెలుసుకునేందుకు జరిగిన సర్వే సంస్థని దిగ్భ్రాంతికి గురిచేసింది. మలేరియా ట్రీట్‌మెంట్ కోసం ఎక్కువగా వినియోగించే క్వినైన్ సల్ఫేట్ ప్రమాణాలకు అనుగుణంగా లేనట్లు తేలింది. తక్కువ పరిమాణంలో అందుబాటులో ఉండాల్సిన ఈ మందు ఆందోళన కలిగించేలా **89**శాతం తప్పుడు ప్రమాణాలతో లభిస్తోందని తేలింది. ఇదిలా ఉంటే ఈ మందును **86**శాతం మంది ఫార్మాసిస్టులు సరిగా భద్రపరచడం లేదని తెలిసింది. అందుకే ఎక్కువ ప్రభావం కలిగిన మందులు కొనేటప్పుడు డాక్టర్ రాసిచ్చిన చీటీకి అనుగుణంగా అవి ఉన్నాయో, లేదో సమగ్రంగా పరిశీలించి కొనుగోలుచేయాలని ఎఫ్‌డియే సూచిస్తోంది.